## క్లుప్తంగా

### నేడు మంత్రి రోజా పర్యటన

పుత్తూరు రూరల్: స్థానిక ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఉదయం 9.30 గంటలకు నిర్వహించే మెగా జాబ్‌మేళాను పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా ప్రారంభిస్తారు. రాష్ట్ర స్కిల్ డెవలెప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్‌మేళాలో 16 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. పదో తరగతి పాస్/ఫెయిల్ నుంచి పీజీ వరకు విద్యార్హత కలిగిన యువతీ యువకులు httpr://www.aprrdc.in ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. వివరాలకు 63009 54441, 83744 21195 నంబర్లలో సంప్రదించాలి. ఈ మేరకు మంత్రి కార్యాలయం నుంచి గురువారం ప్రకటన వెలువడింది.

### పాదచారులకు అన్నదానం


అన్నదానం చేస్తున్న హ్యూమన్‌రైట్స్ సభ్యులు

నగరి: నగరి బస్టాండు సమీపంలోని నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆధ్వర్యంలో 500 మందికి అన్నదానం చేశారు. గురువారం నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పి.సంపత్ కుమార్ ఆదేశాల మేరకు నగరిలో చలివేంద్రం ప్రారంభించి మజ్జిగ, పెరుగన్నం పాదచారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ పాండు, నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సౌత్ ఇండియా ఇన్‌చార్జ్ వీటీ భాస్కర్, జిల్లా ఉపాధ్యక్షుడు ప్రతాప్ పాల్గొన్నారు.

### గ్రంథాలయ అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు

నగరి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి గ్రంథాలయ అధ్యాపకుడి నియామకం కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లైబ్రరీ సైన్స్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసి 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన వారు తమ బయోడేటా, పీజీ మార్కులిస్టు, కాన్వొకేషన్‌తో ఈ నెల 3వ తేదీ ఉదయం 10.30 గంటలకు కళాశాలలో హాజరు కావాలన్నారు. గ్రంథాలయ శాస్త్రంలో పీహెచ్‌డీ, యూజీసీ.నెట్, ఏపీసెట్, ఏపీస్లెట్ కోర్సులు చేసి, అర్హత కలిగి ఉన్నవారికి ప్రాధాన్యత ఇస్తామన్నారు.

### నేటి నుంచి కుంభాభిషేక మహోత్సవాలు

వెదురుకుప్పం: మండలంలోని నల్లవెంగనపల్లె పంచాయతీ బండకింద వడ్డిండ్లు గ్రామంలో నూతనంగా నిర్మించిన గుర్రప్పస్వామి, యల్లమ్మ ఆలయ కుంభాభిషేక మహోత్సవాలు జరగనున్నట్లు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం నుంచి ఆదివారం వరకు మూడురోజులు ఆలయంలో విశేష పూజలు జరుగుతాయన్నారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదానం చేపడతామని పేర్కొన్నారు.

### ఫైర్ ఆఫీసర్‌గా డి.సుబ్బరాజు


ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు

నగరి: నగరి ఫైర్ ఆఫీసర్‌గా డి.సుబ్బరాజు గురువారం బాధ్యతలు స్వీకరించారు. పీలేరు ఫైర్‌స్టేషన్ నుంచి బదిలీపై ఆయన నగరికి విచ్చేశారు. ఇదివరలో ఫైర్ ఆఫీసర్‌గా ఉన్న మస్తాన్ ఆయనకు బాధ్యతలను అప్పగించారు. అగ్ని ప్రమాదాలపై ప్రజలకు అవగాహన ఏర్పరచడం, ప్రమాదాల సమయంలో త్వరితగతిన వెళ్లి అదుపుజేయడం లాంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

### జీడీ నెల్లూరు ఏఎస్‌డబ్ల్యూఓగా షకీల

చిత్తూరు కలెక్టరేట్: సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలోని జీడీ నెల్లూరు ఏఎస్‌డబ్ల్యూఓ (అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్)గా షకీల నియమితులయ్యారు. సాధారణ బదిలీల్లో ఆమె జీడీ నెల్లూరుకు బదిలీపై వెళ్లారు. ఆమె గతంలో పలమనేరు ఏఎస్‌డబ్ల్యూఓగా విధులు నిర్వహించేవారు. అక్కడ ఐదేళ్లు పూర్తి కావడంతో జీడీ నెల్లూరుకు బదిలీ అయినట్లు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు తెలిపారు.

### 4న ఉచిత కంటి వైద్యశిబిరం

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లం భారతంమిట్ట ఆవరణలో 4న ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు సామాజిక కార్యకర్త విద్యాసాగర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. తిరుపతి తాటితోపు వద్ద ఉన్న సురేంద్ర కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ప్రముఖ వైద్య నిపుణులు సురేంద్ర వైద్యబృందంచే రోగులకు ఉచితంగా అన్నిరకాల వైద్య పరీక్షలు, ఆపరేషన్లు చేస్తున్నట్లు చెప్పారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద ఆపరేషన్లు చేసుకునే వారు ఆరోగ్యశ్రీ కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకు పాసుపుస్తకం ఒరిజినల్స్ తీసుకురావాలని సూచించారు. వివరాలకు 08772248140, 7569778285 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

### గడ్డివామి దగ్ధం

ఏర్పేడు: ఆగంతకులు దుశ్చర్యతో గడ్డివామి దగ్ధమైన సంఘటన గురువారం మండలంలోని కందాడు పంచాయతీ వెంకటాపురంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం.. గ్రామానికి చెందిన రైతు ప్రతాపరాజు గడ్డివామిని మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. గడ్డివామి పూర్తిగా దగ్ధమైంది. శ్రీకాళహస్తి అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పేశారు. రూ.లక్ష ఆస్తి నష్టం వాటిల్లిందని బాధిత రైతు తెలిపాడు.

# ప్రకృతి పరువాలను ఆస్వాదిస్తూ..


పాండురాజుపారపై ట్రెక్కింగ్ చేస్తున్న విద్యార్థులు

- వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుంటున్న విద్యార్థులు
- ఏటా సెలవుల్లో విద్యార్థులకు కొత్త అనుభూతిని మిగిల్చేలా ప్రభుత్వం సరికొత్త పంథా
- క్రీడల కోసం శిక్షణా శిబిరాలు
- ఈసారి ట్రెక్కింగ్, స్విమ్మింగ్ చేస్తూ ఆనందంగా గడుపుతున్న విద్యార్థులు

నగరి: చదువుతో పాటు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పలు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తోంది. అందులో భాగంగా వేసవి సెలవుల్లో ఆనందంతో పాటు విజ్ఞానాన్ని అందించాలని, విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీయడానికి ఉపయోగపడాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. ప్రభుత్వం ఏర్పాటు చేసిన వేసవి క్యాంప్‌లలో విద్యార్థులు క్రీడల్లో శిక్షణ పొందడంతో పాటు హిమాలయ శిఖరాలను అధిరోహించిన విద్యార్థిని మలావత్ పూర్ణను ఆదర్శంగా తీసుకుని అదే స్ఫూర్తి పలు విద్యార్థుల్లో నింపేందుకు ట్రెక్కింగ్ క్రీడల్లో శిక్షణ అందజేస్తున్నారు. అలాగే స్విమ్మింగ్‌లో శిక్షణ అందిస్తున్నారు. తల్లిదండ్రులు సైతం విద్యార్థులను ఈ దిశగా ప్రోత్సహిస్తున్నారు. దీంతో విద్యార్థులు ట్రెక్కింగ్, స్విమ్మింగ్ అంటూ సెలవులను ఆస్వాదిస్తూ ఆనందంగా గడుపుతున్నారు. బుధవారం ట్రెక్కింగ్‌లో భాగంగా విద్యార్థులు నగరి పట్టణానికి సమీపంలో గల పాండురాజు పార అనే గుట్టపైకి వెళ్లారు. ట్రెక్కింగ్ కొత్త అనుభూతిని నింపడంతో ఉత్సాహంగా ముందుకు అడుగులు వేశారు. పాండురాజు గుట్టపైకి వెళ్లిన వారికి కోచ్‌లు పాండవులు నివశించినట్లు చెప్పుకునే రాతి బండలతో పేర్చిన గుడారాలు, గుహలు, భీముడు వాల్చినట్టు చెప్పే బండరాయి లాంటి వాటి గురించి విశదీకరించడంతో పాటు గుట్టపై నుంచి చుట్టూ అందంగా కనిపించే ప్రాంతాలపై అవగాహన కల్పించారు. కొండ బండలపై యోగా, ధ్యానంలో శిక్షణ అందించారు. అనంతరం కార్వేటినగరం మార్గంలో ఉన్న స్విమ్మింగ్ పూల్‌కు విద్యార్థులను తీసుకెళ్లిన కోచ్‌లు విద్యార్థులకు ఈతపై శిక్షణ అందించారు.

#### గతంలో ఎన్నడూ లేనంత ఆనందం..

గతంలో ఎన్నోసార్లు సెలువులు వచ్చాయని, అయితే ఈ సంవత్సరం గడిపినంత ఆనందంగా గతంలో తాము ఎప్పుడూ ఇంత అనుభూతి పొందలేదని విద్యార్థులు తెలిపారు. ఈ సందర్భంగా వారు ఉత్సాహంగా స్విమ్మింగ్ పూల్ లో నీళ్లలో చిందులు వేశారు. ఈ కార్యక్రమంలో కోచ్‌లు బాబు, మణి, లోకనాథం, గోపి, రాజ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


కొండపై ధ్యానం చేస్తున్న విద్యార్థులు


బండపై పగుళ్లను చేతులతో లాగుతూ ఆడుకుంటున్న విద్యార్థులు


స్విమ్మింగ్ చేస్తూ ఆహ్లాదంగా గడుపుతున్న విద్యార్థులు

### నేడు కంచి గరుడసేవ

- ముస్తాబవుతున్న కరకంఠేశ్వర ఆలయం


ముస్తాబైన కరియమాణిక్యస్వామి ఆలయం

నగరి: పట్టణ పరిధిలోని టీటీడీ ఆధీనంలో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత కరియమాణిక్య స్వామి ఆలయంలో శుక్రవారం కంచి గరుడ సేవ నిర్వహించనున్నారు. ఈ ఉత్సవ ఏర్పాట్లను టీటీడీ అధికారులు ప్రారంభించారు. గరుడసేవను పురస్కరించుకుని ఆలయం వద్ద ఏర్పాట్లు ఘనంగా జరుగుతున్నాయి. ఆలయ ఆవరణలో ఇప్పటికే చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. మామిడాకులు, పుష్పాలతో ఆలయాన్ని అలంకరించారు. ఆలయ అధికారి వెంకటరమణ ఏర్పాట్లను పర్యవేక్షిస్తుండగా ఆలయ సేవకులు భక్తులు కంచి గరుడసేవ పనుల్లో పాలు పంచుకుంటున్నారు. కంచి గరుడసేవ జరిగే మాడవీధుల్లో ఊరేగింపుగా వచ్చే భక్తులకు ప్రసాదాలుగా మజ్జిగ, శీతల పానీయాలు అందించేందుకు పలువురు దాతలు ముందుకు వస్తున్నారు.

# ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు

- నాలుగేళ్లలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందింది
- ప్రజల ఆశయాలకు అనుగుణంగా సీఎం జగనన్న పాలన అందిస్తున్నారు
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి


గొల్లకండ్రిగలో లబ్ధిదారులతో మాట్లాడుతన్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

పాలసముద్రం: పేదల ఇంట ఆనందం నింపడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన అందిస్తున్నారని డిప్యూటీ సీఎం కే.నారాయణస్వామి తెలిపారు. గురువారం ఆముదాల గ్రామ సచివాలయం పరిధిలోని గొల్లకండ్రిగ, రేణుకాపురం, రంగాపురం, పుల్లయ్యగుంట, జయలక్ష్మిపురం, ఆముదాల దళితవాడ, ఎల్ఎస్ పురం గ్రామాల్లో ఎంపీటీసీ లిఖిత, సర్పంచ్ అనురేఖమదివాన్ ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన డిప్యూటీ సీఎం నారాయణస్వామి సచివాలయ ఉద్యోగులు, మండలస్థాయి అధికారులు వలంటీర్లతో కలసి గడప గడపకు వెళ్లి అర్హులైన వారికి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందుతున్నాయా ? లేదా ? సమస్యలు ఏమైనా ఉన్నాయా ? అని ఆరాతీశారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ హాల్ కావాలని రేణుకాపురం గ్రామస్తులు విన్నవించారు. ఆముదాల దళితవాడలో ఇంటి పట్టాలు కావాలని పలువురు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే ఆయన స్పందిస్తూ వారం రోజుల్లో అర్హులైన వారికి పట్టాతో పాటు ఇల్లు మంజూరు చేయాలని సంబంధిత అధికారులను మంత్రి నారాయణస్వామి ఆదేశించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పేదలు సంతోషంగా ఉన్నారని, ఆ మాటను తనతో గడప గడపకు వెళ్తున్నప్పుడు ప్రజలే ఆనందంగా చెబుతున్నారని తెలిపారు. సీఎం జగనన్న నాడు పాదయాత్రలో ఏ హామీలైతే ఇచ్చారో వాటిని 95 శాతం అమలు చేసి, అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేశారని చెప్పారు.

#### రైతులు సుభిక్షంగా ఉన్నారు..

రాష్ట్ర అభివృద్ధి కోసం, ప్రజల ఆకాంక్ష మేరకు జగనన్న మరోమారు ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రతి ఒక్కరూ పని చేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలను మంత్రి నారాయణస్వామి ఆదేశించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సకాలంలో వర్షాలు కురిసి రైతులు సుభిక్షంగా ఉన్నారన్నారు. చంద్రబాబు పరిపాలనలో వర్షాలు కురవక రాష్ట్రం అంతా ఎడారిగా మారిందని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ కమిటీ చైర్మన్ శివప్రకాష్ రాజు, జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్, మండల కనీ్వనర్ తులసీరామ్ యాదవ్, వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్, ఎంపీడీఓ శ్రీనివాసన్, తహసీల్దార్ బాబు, ఐకేపీ ఏపీఎం ఫరీదు మస్తాన్, ఎంఈఓ రాజేంద్ర ప్రసాద్, సర్పంచ్ గాలి మహేష్ బాబు, అరుల్, వేణు, గోపి, పుత్తూరు కేశవరెడ్డి, త్యాగరాజ్, నరసింహనాయుడు, సుందరాజు, సుబ్రమణ్యరెడ్డి, మధు, పయణి, జనార్దన నాయుడు, మురళి, మండల పరిధిలోని నాయకులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

#### జగనన్న మా పాలిట దేవుడు..



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో మా కష్టాలు తెలుసుకున్నాడు. సీఎం అయ్యాక ఈ నాలుగేళ్లగా మాకు అన్ని సంక్షేమ పథకాలు అందుతున్నాయి. మా పాలిట దేవుడు జగనన్న. గత ప్రభుత్వంలో ఇల్లు మంజూరు చేయాలని తిరిగితిరిగి అలసిపోయా. చిన్న గుడిసెల్లో ఉండేదాన్ని. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక మాకు ఇల్లు కట్టించారు. ఇప్పుడు ఆ ఇంటిలోనే సంతోషంగా ఉంటున్నా.

– అమ్ములు, రేణుకాపురం

#### మళ్లీ జగనన్నే సీఎం కావాలి..



వలంటీర్లు మాకు సంక్షేమ పథకాలను మా ఇంటి తలుపు తట్టి ఇచ్చిపోతున్నారు. ఆసరా, రైతు భరోసా, అమ్మఒడి నగదు పథకాల లబ్ధి నేరుగా మా బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారు. మాకు ఈ సంక్షేమ పథకాలు అన్నీ ఇలాగే అందాలంటే మాకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం కావాలి. అప్పుడే మేము ఆనందంగా ఉంటాం.

– ఉమ, ఆముదాల దళితవాడ

#### జగనన్నది సాయం చేసే గుణం..



మాలాంటి పేదలకు సాయం అందించాలన్న గుణం ఉన్న నాయకుడు సీఎం జగనన్న. ఎన్నికల్లో ఇచ్చిన హామీలతో పాటు మాలాంటి నిరుపేదలకు ఎన్నో రకాలుగా సాయం అందిస్తున్నాడు. ఇన్ని పథకాలు ఇచ్చిన ఏకైక ముఖ్యమంత్రి జగనన్నే. నాకు వైఎస్సార్ ఆసరా, అమ్మఒడి, రైతు భరోసా, జగనన్న చేదోడు పథకాల ద్వారా ఎంతో లబ్ధి చేకూరింది. ఆయన సాయం మరిచిపోం.

–మంజు, రేణుకాపురం

### ప్రారంభానికి వేళాయే..

- డిప్యూటీ సీఎం చేతుల మీదుగా నేడు కొటార్వేడు గ్రామ సచివాలయం ప్రారంభం
- యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేసిన అధికారులు
- ప్రభుత్వ పాలన తమ చెంతకే రావడంపై గ్రామస్తుల ఆనందం


ప్రారంభానికి ముస్తాబైన కొటార్వేడు సచివాలయ భవనం

కార్వేటినగరం: మండలంలోని కొటార్వేడు సచివాలయ భవనం, వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయం ప్రారంభానికి సిద్ధమయ్యాయి. శుక్రవారం ఉదయం 10 గంటలకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి నూతన భవనాలను ప్రారంభిస్తారని అధికారులు వెల్లడించారు. గతంలో ఇరుకుగా ఉన్న పంచాయతీ కార్యాలయాల్లో పాలన అసౌకర్యంగా సాగేది. ప్రస్తుతం రూ.40 లక్షలతో గ్రామ సచివాలయ భవన నిర్మాణం చేపట్టడం జరిగింది. దీంతో తమ గ్రామంలోనే ప్రభుత్వ సేవలు అందుతాయని, అధికారులు ఇక్కడే ఉండడం వల్ల ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కారం అవుతాయని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా తమ పంచాయతీలో పార్టీ కార్యాలయం ఏర్పాటు చేయడం కూడా ఇదే మొదటిసారి అని కొటార్వేడు గ్రామ ప్రజలు చెబుతున్నారు. అలాగే టీటీడీ ఆధ్వర్యంలో సుమారు రూ.20 లక్షలతో ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి గొల్లకండ్రిగ గ్రామంలో, గొల్లకండ్రిగ దళితవాడలో హిందూ ఆలయాల నిర్మాణానికి భూమిపూజ చేశారు. సచివాలయ పరిధిలో 3,165 మంది జనాభా, 436 కుటుంబాలు, 16 గ్రామాలు ఉన్నాయి. 16 మంది వలంటీర్లు, గ్రామ సచివాలయ సిబ్బంది పని చేస్తున్నారు.

# శాస్త్రోక్తంగా కుంభాభిషేకం


కుంభాభిషేకం పూజల్లో పాల్గొన్న శ్రీశైలం ఆలయ కమిటీ చైర్మన్ చక్రపాణిరెడ్డి

నింద్ర: మండలంలోని కొప్పేడు పంచాయతీలోని వేధాంతపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన కొల్లాపురి అమ్మవారి ఆలయంలో కుంభాభిషేకాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం వేదపండితులు శాస్త్రోక్తంగా మంత్రోచ్ఛరణలు పఠిస్తూ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠించారు. కుంభాభిషేకం సందర్భంగా ఆలయంలో హోమం, కలశ పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులను అమ్మవారి దర్శనానికి అనుమతించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయానికి శ్రీశైల ఆలయ కమిటీ చైర్మన్ రెడ్డివారి చక్రపాణి రెడ్డి రూ.లక్ష విరాళం అందించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే మంత్రి రోజా సోదరుడు రాంప్రసాద్ రెడ్డి అమ్మవారిని దర్శించుకుని రూ.50 వేలు ఆలయానికి వితరణగా ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు పరంధామ, ఎంపీటీసీ భాస్కర్ రెడ్డి, కోఆప్షన్ మెంబర్ అనిల్, మాజీ ఎంపీటీసీ చెంచమ్మ, సర్పంచ్‌లు సంపూర్ణమ్మ, మురళీనాయుడు, జయమ్మ గ్రామస్తులు పాల్గొన్నారు.

### ఘనంగా ప్రదోషకాల పూజలు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎస్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం ప్రదోషకాల పూజలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా శివునికి నందీశ్వరునికి ఏకకాలంలో అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. అంతకుముందు వేకువజామునే కొండమల్లీశ్వరుడికి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తి ప్రపత్తులతో పూజలు చేపట్టారు. సాయంత్రం ప్రదోష పూజల అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు పంచి పెట్టారు. ఇందులో భాగంగా ఆలయ ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు చేశారు. ఆలయ ఆవరణలో చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. భక్తులు విశేషసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

# వైభవంగా గంగమ్మ జాతర


గంగమ్మకు పూజలు చేస్తున్న రాంప్రసాద్ రెడ్డి

నింద్ర: మండలంలోని నింద్ర, అత్తూరు గ్రామాల్లో గురువారం గంగమ్మ జాతర వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అంబలి పోసి ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు భారీసంఖ్యలో మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు. నింద్రలో జరిగిన జాతరలో మంత్రి రోజా సోదరుడు రాంప్రసాద్ రెడ్డి పాల్గొని గంగమ్మను దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దీప, వైస్ ఎంపీపీ శుభ, పార్టీ నాయకులు శ్యామ్‌లాల్, మేరి, సర్పంచ్ బాబురెడ్డి, అనిల్, వెంకటేష్ దర్శించుకున్నారు.

# కిడ్నీ బాధితురాలికి ఆర్థికసాయం


కిడ్నీ బాధితురాలికి ఆర్థిక సహాయం చేస్తున్న సహృదయ సేవాసమితి సభ్యులు

కార్వేటినగరం: కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న పద్మజకు సహృదయ సేవాసమితి ఆధ్వర్యంలో గురువారం ఆర్థికసాయం అందించినట్లు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు, గౌరవ అధ్యక్షుడు టి.తిరుమలయ్య, న్యామతుల్ల తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేజర్ పంచాయతీ కార్వేటినగరం పరిధిలోని విజయమాంబాపురం గ్రామానికి చెందిన పద్మజ కిడ్నీ సమస్యతో బాధపడుతున్నట్లు సమాచారం అందిందన్నారు. సహృదయ సేవా సమితి సభ్యులు స్పందించి తక్షణ సహాయం కింద రూ.15 వేలు నగదును అందించడం జరిగిందన్నారు. ఆరోగ్యం కుదుట పడేంతవరకు ఆర్థికసాయం అందించడానికి సంస్థ సిద్ధంగా ఉందన్నారు. గతంలో కూడా ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో చేసినట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో భాగంగా బాధితురాలి కుటుంబ సభ్యులు మాట్లాడుతూ ఆర్థిక స్తోమత లేని తమ కుటుంబ కష్టాన్ని గుర్తించి, ఆర్థికసాయం అందించిన సహృదయ సేవాసమితి సభ్యులకు రుణపడి ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు జయచంద్ర, హరిబాబు, మాజీ ప్రధాన కార్యదర్శి సర్దార్, సంస్థ సభ్యులు గణేష్, గురుప్రసాద్, సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

### తిరుపతిలో పింఛన్ అందజేత


సుశీలమ్మకు పింఛన్ అందిస్తున్న వలంటీర్

కార్వేటినగరం: మండల పరిధిలోని ఆర్కేవీ బీపేట ఇందిరా కాలనీకి చెందిన సీ.సుశీల బతుకుదెరువు కోసం తిరుపతి వీధుల్లో పండ్లను విక్రయిస్తూ జీవనం సాగిస్తోంది. ఆమెకు ప్రభుత్వం వితంతు పింఛన్ అందిస్తోంది. ఈ నేపథ్యంలో జూన్ నెలకు సంబంధించిన పింఛన్‌ను వలంటీర్ ఎం.నాగరాజు తిరుపతికి వెళ్లి గురువారం సుశీలకు అందజేశాడు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ప్రభుత్వంలో ఎక్కడా పింఛన్ కానీ, పథకాలు కానీ వలంటీర్లు వచ్చి ఇస్తున్నారని.. ఈ ప్రభుత్వం మాలాంటి నిరుపేదలకు అండగా ఉంటోందని ఆనందం వ్యక్తం చేసింది. సీఎం జగనన్నకు ఎప్పుడూ రుణపడి ఉంటానని తెలిపింది.

### సారా విక్రేత అరెస్ట్


నిందితుడి అరెస్టు చూపుతున్న ఎస్‌ఐ లోకేష్

వెదురుకుప్పం: మండలంలోని బొమ్మయ్యపల్లె గ్రామంలో అక్రమంగా సారా విక్రయిస్తున్న మునికృష్ణను గురువారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ లోకేష్ తెలిపారు. సారా అమ్ముతున్నట్లు సమాచారం అందడంతో ఎస్‌ఐతో పాటు సిబ్బంది దాడులు నిర్వహించారు. నిందితుడి వద్ద ఉన్న 10 లీటర్ల సారాను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. అనంతరం నిందితున్ని అరెస్ట్ చేసి పుత్తూరు కోర్టుకు తరలించగా రిమాండ్ విధించినట్లు చెప్పారు. గతంలో నిందితుడిపై కేసు ఉన్నట్లు తెలిపారు. గతంలో సారా కేసుల్లో ముద్దాయిలు మళ్లీ పట్టుబడితే పీడీ యాక్టు కింద కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ తెలిపారు.

# ప్రభుత్వ కళాశాలల్లో చేర్పించండి


తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న మనోహర్ నాయుడు

పాలసముద్రం: మండలంలోని బలిజకండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన బాలికల కళాశాల్లో విద్యార్థినులను చేర్పించాలని హెచ్ఎం మనోహర్‌నాయుడు తెలిపారు. గురువారం ఆయన, అధ్యాపకులతో కలసి పదోతరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్ ఫీజు తప్ప ఇతర ఫీజులు చెల్లించాల్సిన పనిలేదని వివరించారు. విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, అర్హులైన వారికి ఉపకార వేతనాలు, వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ, పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం, బస్సు పాసు సౌకర్యం వంటి ఎన్నో సదుపాయాలు కల్పిస్తామన్నారు. అందువల్ల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ కళాశాలల్లో చేర్పించాలని కోరారు. ప్రైవేటు స్కూళ్లలో చేర్పించి కష్టపడి సంపాదించిన డబ్బులను వృథా చేసుకోవద్దని సూచించారు. ప్రభుత్వ కళాశాలల్లో చదివిన ఎంతో మంది విద్యార్థులు ఉన్నతస్థాయిలో ఉన్నారని గుర్తు చేశారు.